


# మాత్సర్యం

సరస్వతికి పదిహేడోయేట పెళ్ళిచేయాలనుకుంటున్నప్పుడు - మధు 'అప్పుడే సరసుకు పెళ్ళేమిటి నాన్నా!' అన్నాడు. ఎదిగిన పిల్లకు పెళ్ళి చేయకపోతే ఎలాగని తండ్రీ ఆడపిల్లలు ఎప్పటికైనా పరాయిగడప ఎక్కవలసిన వాళ్ళేనని తల్లీ అనేప్పటికి మధు మారుమాట్లాడలేకపోయాడు. ఎందుకో మధుకు చెల్లెలి పెళ్ళి అనగానే తెలీని విచారం ఉద్భవించుకొచ్చింది. ఊహ తెలిసినప్పటినుంచీ అన్నా-చెల్లెలూ ఎంతో ఆనందంతో ఎంతో ఉత్సాహంతో రోజులుగడుపుతూ పెద్దవాళ్ళయ్యారు.

ఇంత తిని, ఇంత ఇతరులకు పెట్టగలిగిన తాహతు ఆ కుటుంబానికి ఉన్నకారణాన, అన్నకీ చెల్లికీ ఏలోటూ లేకుండా జరిగిపోతూ వచ్చింది. ఆ కుటుంబానికీ ఆ ఇద్దరే గనుక, ఎంతో గారాబంతో పెరిగారు.

సరసు స్కూలు కెళ్ళటం పదహారోయేటనే మానుకుంది. 'ఒక్కగానొక్కతివి! వాడెలాగూ కాలేజీ చదువుకని పట్నానికెళ్ళాడు. నువ్వూ మా ఎదుట లేకపోతే - మా జీవితాలు ఏంగాను?' అని సరసును స్కూలుకెళ్ళనీయలేదు. నిజంగా మాత్రం సరసు స్కూలు మానుకున్నాకనే చాలా విషయాలు నేర్చుకుంది. అన్ని విషయాలు ఎలా తెలుసని చుట్టుపక్కల ఆడవాళ్ళంతా ఆశ్చర్యపడేవారు! మధ్యాహ్నం పూట నలుగురు ఆడవాళ్లు చేరితే ఏవేవో చెప్పుక పోయేది - 'భారత దేశ రిపబ్లిక్ అవతరణ సందర్భంలో ఆంధ్ర రాష్ట్రం రాని సంగతిగూర్చీ, మద్రాసు ప్రభుత్వం అమలు పరిచే శాసనాల్ని గూర్చీ, పత్రికలూ-పత్రికల్లో వెలువడే రచనల్ని గూర్చీ, ఆపైని కాలేజీ చదువుల్ని గూర్చీ, ఆ చదువుకునే వ్యక్తుల్ని గూర్చీ-వివరిస్తున్నప్పుడు వినేవాళ్లు విస్తుపోయేవారు. అవి తమకు తెలీని విషయాలు గనుక అతి ఆసక్తితో వినీవినీ ఆఖరున అడిగే వారు- 'ఏమేం పిల్లా! మా కళ్ళెదుట పుట్టి పెరిగిన నీకు ఇన్ని విషయాలెలా తెలుసే!' అని! నవ్వుతూ సమాధానం చెప్పేది -'నన్ను పెంచి పెద్దదాన్ని చేసింది నాన్నా అమ్మా-కాని నాలో జీవం పోసి నన్ను విజ్ఞాన శిఖరాలకు చేర్చింది ఒక్క అన్నయ్య మాత్రమే!' అని.

* * *

మధుకు శలవలయిపోయాయి. వెళ్ళేరోజున మరల తండ్రితో - 'నాన్నా! ఈ సంవత్సరానికి సరసు పెళ్ళి ఆపితే ఏం?' అన్నాడు మొదట్లోలాగానే. 'కలిసివస్తే చేయాలనే వుంది. అయినా ఆ ఘడియ నెత్తికి రావాలిగాని, ఆపితేమటుకు ఆగుతుందా?' అన్నాడు, తండ్రి. మధు మళ్లా మాట్లాడలేదు.

సరసుకు ఈ విషయాలన్నీ తెలుసు! 'ఎందుకో చెబుతున్నాడుగా అన్నయ్య మాట నాన్న వినడేం' అనుకుంది తనలో తాను. తరచిచూస్తే అన్నయ్య ఇలా అనటంలో ఏదో అంతరార్థం ఇమిడి ఉందనుకుందిగాని ఏమిటో ఫలానా అని తెలీలేదు.

దండమూడి మహీధర కుమార్

పట్టణం వెళ్లిన మూడో రోజున మధు తండ్రికి ఒక ఉత్తరం రాశాడు - సరసు పెళ్లి విషయంలో ఈ సంవత్సరం ఆగవలసిందనీ, సరసు భావాలకు తగిన వరుణ్ణి తనకు తానుగా వెదికి సమకూర్చగలననీ! దీన్ని చదువుకుని మధు తండ్రి - చూచావా వీడు! మొదట్లో నే చెప్పకూడదూ ఇలాగని! అని మధు తల్లినుద్దేశించి అన్నాడు సంతోషంగా. 'ఇంతకంటే కావలసిందేముంది' అంది ఆమె ముచ్చటపడుతూ! ఇదంతా తెలుసుకొని సరసు మురిసి పోయింది - ఈ విషయం తనకిదివరకే తెలిసినట్టు.

చూస్తూండగానే రోజులు రెక్కలు కట్టుక ఎగిరిపోయాయి. సరసు వివాహం చంద్రంతో అయిపోయింది. చంద్రాన్ని చూచి సరసు తలిదండ్రులు ఎంతో సంతోషించారు. తగిన వరుడని అంతా చెప్పుకున్నారు. తన సోదరుడు - మధు- ఒనరించిన ఈ మహోత్కృష్ట విధికి సరసు హృదయం నెమలిలా నాట్యంచేసి ఆనంద భంగ మాలికల్లో తేలిపోయింది. సంతోష భావనా ముద్రలో మునిగి తన్మయత్వం పొందింది. తనకట్టెదుట ఒక క్రొంగ్రొత్త జీవితం కాంతి పుంజాల్ని వెదజల్లుతోంది. చంద్రం తన కన్నివిధాలా సరిపడగల భర్త అని ఆమె నిర్ణయించుకుంది. ఇంతకంటే స్త్రీకి కావలసిందేముంది!

అసలు మధు ఉపజ్ఞతను మెచ్చుకోవాలి; రెండోసారి ఇంటినుంచి కాలేజీకి వెళ్లినప్పటి నుంచీ తన చెల్లెలి పెళ్లినిగూర్చే ఆలోచించాడు. సరసు భావాల్ని సంస్కారాల్ని అవగాహన చేసుకున్న వాడుగనుక - చంద్రం సరసుకు తగిన భర్త అని తేల్చుకోడానికి ఎక్కువ కాలం పట్టలేదు. పైగా చంద్రాన్ని తను ఎప్పటినుంచో ఎరుగు! పత్రికలకు తరుచు రాస్తుంటాడు. కాలేజీ మేగ్జన్‌లో రాసిన రచనలు చదివాక అతన్ని ఎంతోమంది ఎంతో ఇదిగా ప్రశంసించటం తనకు తెలీందికాదు.

ఉభయాలూ ఒక కాలేజీలో, ఒకక్లాసులో. పైగా పాత పరిచయం: వీటన్నిటినీ పురస్కరించుకొని మధు చంద్రాన్ని అతి సులువుగా అడగ కలిగేడు. చంద్రం మొదట్లో ఆశ్చర్య పోయాడు. నిజం అని తెలుసుకున్నాక చంద్రం ఈమాటల్ని చెప్పాడు, 'మధూ! నీకు తెలియదేమో పాపం తల్లీ లేను తండ్రీ లేను నేనొక్కణ్ణి. ఉన్న ఆస్తి బహుకొద్ది. ఇప్పటివరకూ మేనమామలు పెంచుతూ వచ్చారు. వీటన్నిటికీ ఇష్టమైతే మటుకు - నా అభ్యంతరం లేదు.' 'ఆస్తి ఉండి ఒరగబెడుతుందంట్రా! మనిషిలో మంచి అనేది ఉండాలిగాని! ఆస్తిని మనుషులు పుట్టించారా, లేక మనుష్యుల్ని ఆస్తి పుట్టించిందా!- తెలుసుకోవాలి గాని మానవుడు ఏపని చేయలేడు?' అని ఆశ్వాసన వాక్యము చెప్పి మధు చంద్రాన్ని ఒప్పించాడు. ఆపైని తన తలిదండ్రులతో, సరసుతో చంద్రాన్ని గూర్చి చెప్పి ఆఖరికి ఈ వివాహ ఘట్టాన్ని సంపూర్ణం చేశాడు.

* * *

సరసు పెళ్ళి చంద్రంతో అయి సంవత్సరం గడిచింది. ఈ మధ్యకాలంలో రోజులు చాలా హాయిగా గడిచాయి. ప్రతిసారీ శెలవల్లో చంద్రం మధు కలిసి ఇంటికొచ్చేవాళ్ళు! ఇంటి దగ్గర ఉన్నంతకాలమూ ఇద్దరూ కలిసి షికారుకు వెళ్లేవారు. సంధ్యా సమయాల్లో చేతులు పుచ్చుకొని పొలం గట్టుమీదుగా నడిచేవారు! భోజనం చేయబోయే ముందూ, చేసేప్పుడు, ఆపైనికూడా ఏవేవో కబుర్లు ఎన్నెన్నో చెప్పుకునేవారు! ఆ కబుర్లు ఇవి అని తేల్చి చెప్పటం అసాధ్యమే అవుతుంది. ఉభయుల సంభాషణలో అందుకో గలిగినంత అందుకొని తనూ మాట్లాడేది సరసు! విషయం అర్థం కాకపోతే మాటకు-నిశ్శబ్దంగా కూచొని తీరిగ్గా వినేది.

పరీక్షలు రాసి ఇంటికొచ్చారో లేదో - అప్పుడే మధు పెళ్లియత్నాలు. చూస్తుండగానే మధు పెళ్ళి వాళ్ళ నాన్నా వాళ్లూ కుదిర్చిన ఒక అమ్మాయితో అయిపోయింది.

మధు భార్య అంత చదువుకోలేదు గాని, అందమైనది. కట్నంకూడా బాగా ఇచ్చారు. పెళ్ళికి ముందే అనుకున్నారట-మధు ప్యాసయితే ఎక్కడో చదివించాలని-అత్తగారి ఖర్చుతోనే!

సరసు మధును ఇంత ఆనందంగా వుంటం ఇదివరకెన్నడూ చూడలేదు. 'వదినమ్మ వచ్చింది గదూ అందుకే ఇంత కులుకు' అనుకుంది సరసు. ఆలా అనుకున్నదే గాని పెళ్ళయిన కొత్తలో ప్రతి వ్యక్తి వలపుతలపుల్ని మోసు కెత్తించుకొని ఆనంద సాగరంలో ప్రయాణం చేయడు! తన-

మటుకు తాను ఆ రోజుల్లో ఎన్నెన్ని భావాల్లోకి ప్రవేశించి పులకిత కాలేదు! ఆపైని సరసు మధునుగూర్చి ఏమీ ఆలోచించలేక పోయింది.

'ఏమండీ! మీరెక్కడ చదువుతారు ప్యాసయితే? మా అన్నాయ్ లక్నోలోనో, నాగపూర్‌లోనో లేక బెనారెస్‌లోనో చదువుతాట్ట!' అన్నది సరసు చంద్రంతో. చంద్రం మొహం వివర్ణమైపోయింది. అది చూచి సరసు వెంటనే తానిలాంటి ప్రశ్న వేసి వుండాల్సింది కాదని అనుకుంది. 'అయ్యో! నా తెలివి తెల్లార! వారి మనస్సును అనవసరంగా కష్టపెట్టానే?' అనుకుంది మళ్లా.

'సరసూ! ఉన్నదాంట్లో కాళ్ళు ముడుచుకోవాలిగాని అనవసరపు ఎగుర్లెగరటం నాకు సుతరామూ ఇష్టం లేదు. అయినా నీళ్ళను చిలికితే వెన్న వస్తుందా! ఇదేదో ప్యాసయితే ఏదో ఉద్యోగంతో డబ్బులు తెచ్చుకొని దాంతోనే సరిపెట్టుకోవాలని నా ఉద్దేశ్యం!' అన్నాడు చంద్రం. ఈ మాటలు అని తనకు హాయిని చేకూర్చాడు. కాని వాటిని ఉచ్చరించటానికి చంద్రం పడిన బాధ తనకు మల్లె వ్యథ కలిగించింది. విషయం మార్చేసి 'మా అన్నయ్య అత్తగారింటి నుంచి రేపు వస్తా'డంది.

ఆ రెండో రోజు మధు ఉదయానికి ఉదయమే వచ్చాడు. చూస్తుండగానే ఉదయాలు సాయంత్రాలుగా, సాయంత్రాలు ఉదయాలుగా మారిమారి వారం రోజులు గడిచాయి.

పరీక్షా ఫలితాలు వెలువడ్డాయి. చంద్రం ప్యాసయ్యాడు. మధు తప్పేడు. ఆ రోజు మధు హృదయం ఎంతో పరితప్తమైంది. తండ్రి చంద్రం ప్యాసయినందుకు సంతోషించి మధు తప్పినందుకు కొంచెంగా విచారించి, ఆఖరికి 'చేసుకున్నవాడికి చేసుకున్నంత మహాదేవ!' అని నిట్టూర్చాడు. 'అల్లుడు ప్యాసయ్యాడమ్మా' అని ఇంటి ప్రక్కవాళ్ళకు చెప్పివచ్చింది మధు తల్లి. ఎవరో మధు సంగతి అడిగేప్పటికి—దిగులుపడి 'అబ్బాయికూడా ఒక పార్టులో ప్యాసయ్యా'డని చెప్పింది. ఇక సరసుకు తోచిందే కాదు. ఆమె మానస సరోవరంలో ఎన్నెన్నో భావ తరంగాలు ఒక్క పెట్టున లేచి ఆమెను చక్కిలిగింతలు పెట్టాయి. ఆనందాతిరేకంవల్ల ఆమె నయనాలు ఆర్ద్రాలయ్యాయి. ఇదివరకు చంద్రం చెప్పిన ప్రతి మాటా ఆమె చెవులకు ఒక మధుర సంగీతంలా వినిపిస్తోంది. ఏవో ఆకాంక్షలు! ఆశలు! కలలు! ప్రేమలో ఎన్నెన్ని ఉద్భవించవు?

చక్కగా అలంకరించుకొని వాకిట్లోకి వచ్చేప్పటికి వసారాలో చంద్రం, చంద్రం చుట్టూ వాళ్ళ బాబాయిగారి కిష్టుడూ, గోపీ. వాళ్ళను చూచింది, సరసు. సరసుకు చంద్రాన్ని చూడబుద్ధేయలేదు - ఏమిటోగా వుంది. ఇంతలోకే కిష్టుడు-'సరసూ! చంద్రంగారు ప్యాసయినందుకు పార్టీ ఇవ్వవేమిటి?' అన్నాడు. సరసు లోపలికెళ్లి తల్లితో చెప్పింది. తల్లి సరేనని గదిలోకి వచ్చేప్పటికి మధు ఏదో పిచ్చిగా కూచొని కిటికీలోగుండా బయటికి చూస్తున్నాడు. 'ఏమిటిరా! అంతా బయట వుంటే నీవిలా ఒంటరిగా లోపల కూచున్నావు! మరీ కొద్దూరం — తప్పితే ఇక సర్వం మునిగిపోయినట్లేనా ఏమిటి! లేచి టీపార్టీకి సంబంధించిన ఏర్పాటు చూడు-' అంది ఆమె.

అలాగని ఆమె బయటికి వెళ్ళిపోయింది. 'అన్నయ్యేడే' అంది సరసు. 'లోపలున్నా'డంది తల్లి. సరసు గదిలో కెళ్ళి 'అన్నయ్యా! అలా కూచున్నావేం? లేచి కాస్త బయటికి వెళ్ళి చూడు కిష్టుడూ వాళ్ళూ వచ్చారు. మరి పార్టీ అట ఇవ్వొద్దూ?' అన్నది నవ్వుతూ! 'మీ ఆయనేమీ బ్రహ్మాండాన్ని కల్ల క్రిందులు చేయలేదు - పార్టీ ఇవ్వటానికి! నేను తప్పినందుకు కాస్తయినా విచారంలేదు గాని, ఆయనగారు ఏదో గోవర్ధన పర్వతాన్ని ఎత్తినంత మహాకార్యం చేశాడని మీ కులుకు! అయినా నేను ప్యాసు కావటం నీకసలు ఇష్టమైతేగా!' అన్నాడు కోపంగా. ఒక్కసారిగా సరసు నవనాడులూ కృంగిపోయినాయి. ముఖమండలంలో హాసచ్ఛాయలు మాయమై విషాదరేఖలు అలుముకున్నాయి. 'అదేమిటి అన్నయ్యా! అలా ఎప్పుడూ కాదు' అని చరచరా బయటికి వెళ్ళిపోయింది - ఇంకేమీ మాట్లాడలేక! దొడ్లోకి వెళ్తూన్న సరసును చంద్రం పిలిచాడు. సరసు అలాగే వెళ్ళిపోతోంది. మళ్ళా పిలిచాడు, వెనక్కి తిరిగి చూచి వసారాలో ఎవరూ లేకపోవటంవల్ల చంద్రం

దగ్గర కొచ్చింది. ఆమె కళ్ళల్లో విషాదాశ్రువులు పొంగిపోతున్నాయి. నిరంతరం నవ్వని చిరునవ్వు ప్రభవించుచునే పెదిమలు వెల్లగా కనిపిస్తున్నాయి. ఆమె ముఖారవిందం వాడిలిపోయింది. ఇలాంటి సరసను చూచి చంద్రం ఒక్కసారిగా నివ్వెరపోయాడు. కారణాన్ని గ్రహించటానికి అతనికి ఒక నిమిషంకూడా పట్టలేదు. 'సరసూ! నాకు తెలుసు! నేను ప్యాసు కావటం నీకిష్టం లేదు. మీ అన్నయ్యలాగా తప్పిపోతున్నట్లయితే నవ్వుతూ కన్పించేదానివి. ఇంతకీ నేను ప్యాసయ్యానన్న ఉక్రోషం నీలో ప్రవేశించటంచేత ఇలా తయారయ్యావు! అందుకే కిష్టను, నేను ప్యాసయినందుకు పార్టీ ఇవ్వమంటే మారు మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయావు! సరే వెళ్లు!' అన్నాడు చంద్రం కోపంగా. సరస తల పైకెత్తి చంద్రం వేపు చూచింది. చంద్ర కళ్లు కోపంతో జేవురించాయి. అసలే మధు మాటలతో ఆమె హృదయం దహించుకపోతోంది. పైగా చంద్రం పలికిన పలుకులతో సరస హృదయం మరింత బాధకులోనై దుఃఖ బాష్పాల్ని రాల్చింది, దీనంగా! 'అలా కాదండీ! మీరు పొరబడుతున్నారు!' అని మాత్రం అని లోనికి పరుగెత్తింది.

* * *

వెనకటి రోజుల్ని ఆకళింపుకు తెచ్చుకొని సరస వికలితమైంది. తన నలు వేపులా నిరాశాంధకారం అలుముకున్నట్లు భావించింది. 'నా జీవితమే ఒక మహా విషాదమైన కల అయిపోయింది' అని వూరికే మంచంమీద పడుకొని రకరకాలుగా అనుకుంది. ఇంతలోకే తల్లి వచ్చివేసి 'ఏమిటే?' అంది. ఏం లేకపోవటమేమిటి ఇంత జరిగితేనూ, అని అంతా చెప్పింది సరస! ఆపైని వలవల ఏడ్చింది. 'ఏమిటో గొడవ! మానవ స్వభావాలు మహా విచిత్రంగా వుంటాయి. ఒక నిమిషంలో ప్రేమించటం. మరో నిమిషంలో ద్వేషించటం- ఇలా మారుతుంటాయి. ఇదేనేమో ప్రపంచమంటే!' అన్నది తల్లి.

ఆ సాయంత్రం చంద్రం ఒక్కడే షికారుకు వెళ్లాడు. ఒంటరిగా భోజనం చేశాడు. ఆ పైని ఒంటరిగా వసారాలో కూచున్నప్పుడు- మధు బయటినుంచి లోనికెళ్లాడు. మధు చంద్రం వేపు చూడనైనా లేదు. చంద్రానికి ఈ పరివర్తనంలోని అంతరార్థం అవగతమయింది కాదు. ఆ రాత్రికి మధు తండ్రి - మధుతో 'ఏం రా ఏమిటీ గొడవ? అసలు నువ్వే ఇలాగయితే దాని గతేం గానురా? ఏమిటో ఎక్కువ కొమ్మనే నరుకుతానంటావు; ఆలోచించుకో, నేను చెప్పాల్సినంత అగత్యంలేనే లేదు'- అని అన్నాడు. 'దానికి కరకంకణ కురువింద కందళాలు లేవనే చింత లేదు, మీ ఇరువురి దరహాసం దాని నీరస జీవితానికి ప్రాణం పోస్తుంది'-అని తల్లి పలికింది. మధు అన్ని మాటలూ విన్నాడు, కాని మనస్సు పట్టించుకోలేదు.

'భావావేశంలో తొందరపడి మధుకులోనై పోయాను. ఆఖరికి ఇలా వ్యక్తుల ద్వారా నా జీవితం అపహాస్యం పాలవుతుందని వూహించనైనా లేకపోయాను. నా విశాల దృక్పథానికి ఇంతటి అఘాతం సంభవించగలదని అనుకోలేదు. నాకు అటూ ఇటూ ఎవరూ లేక ఒంటరిగా అనుభవిస్తున్న నా జీవితాన్ని ఊతగా తీసుకొని నన్ను ఎందుకు నా కాకుండా చేశారు'-అని అనుకున్నాడు చంద్రం ఆ రాత్రి.

'చంద్రం తన చెల్లెలికి తగిన భర్తని ఎంచుకోవటం నా పొరపాటు. తాను తెలివిగలవాణ్ణని మహా గర్వం! ఈ విశాలవిశ్వాన్ని స్వర్గఖండంగా ఒనరించాలనీ, సుధాప్రవాహాల్ని ప్రవహింపచేయాలనీ వట్టి వట్టి కబుర్లు చెప్పే కాల్పనిక వ్యక్తి. ఏదో నియమిత కైవారంలోనే పరిధుల్ని ఏర్పరచుకొని జీవితాన్ని సాగించాలనే పరిమిత భావాలు అతని జీవిత విలువల్ని బయల్పరుస్తున్నాయి. ఇలాంటి నికృష్టజీవికి సరసనిచ్చి పెళ్లి చేయటం నా మహాపరాధం' అని అనుకున్నాడు మధు ఆ రాత్రే.

'అన్నయ్య మొహంపై, ఎలాంటి మందహాసం ప్రభవించి నన్ను ఆనందాంబుధిలో వోలలాడించేదో అలాంటి మందహాసం చంద్రంగారి మొహం మీద చూచాను. అహర్నిశలు నా అభ్యుదయాన్ని అన్నయ్య ఆకాంక్షించిన రీతిగానే చంద్రంగారు ఆకాంక్షించారు. ఒకరు చెల్లిగా మరొకరు భార్యగా నన్ను ప్రేమించి నాలో ఒక క్రొత్త జీవితాన్ని పోశారు. కాని ఈరోజు ఆ ఇద్దరూ నన్ను చిరాకుతో, విముఖత్వంతో, ఏవగింపుతో నన్ను దూరం చేశారు

నా జీవితం ఏంగాను?' అని విచారించింది సరసు అదే రోజు రాత్రి.

అర్ధ రాత్రి గడిచింది. చంద్రానికి కునుకు పట్టలేదు. లేచి మంచంమీద కూచొని 'సరసూ!' అని కేకేశాడు. ఒక్క కేకకే సరసు లేచి చంద్రం దగ్గరకొచ్చింది. 'సరసూ!' అన్నాడు ప్రేమగా చంద్రం! 'ఏమిటి?' అంది సరసు - గాద్గికంగా! 'వెళ్లిపోదాం' అన్నాడు చంద్రం. 'ఇంత కటికచీకటిలో ఎక్కడికి?' అంది సరసు! 'నరకంలోకి' అన్నాడు కోపంగా చంద్రం, సరసు మరి మాట్లాడలేక లోలోపల ఆవేదనా విదళితమైపోతోంది. 'నాకు తెలుసు! నువ్వు రావని!' అన్నాడు మెల్లగా 'అలా అనకండి!' అన్నది సరసు. 'అయితే వెళ్లిపోదాం' అన్నాడు చంద్రం. సరసుకు ఏమి చెప్పాలో అర్థంకావటంలేదు.

ఇంతలోకే లోపల్నుంచి మధు లైటు తీసుకొని బయటికివచ్చాడు. 'ఎక్కడికి నీవీ అంధకారంలో వెళ్లేది? ఒక దొంగలాగా పారిపోవలసిన అగత్యం ఏదుకు సంభవించాలి? నీవు సరిగా జీవించలేవు, ఇతరుల్ని జీవించనీయవు!... వెళ్ళదలిస్తే నీవొక్కడివి వెళ్లొచ్చు. సరసును తీసుకెళ్ళటానికి వీల్లేదు'- అన్నాడు మధు అత్యంత కోపంగా.

'మధూ! నువ్వు పొరబడుతున్నావు! సరసు నాభార్య! మా ఇరువురి విషయంలో నీవు జోక్యం చేసుకోడం మంచిదిగాదు' అన్నాడు చంద్రం.

'భార్యల్ని నరకంలోకి తీసుకెళ్లేందుకు కాదు- పెళ్ళి చేసుకోటం. సుఖపెట్టటానికి ఉత్కృష్ట జీవితంలోకి తీసుకెళ్ళటానికి! అన్నాడు మొదటి కంటే కోపంగా- మధు.

ఇక సరసు ఊరుకోలేక పోయింది. ఎవరితో ఏమి చెప్పాలో అనే మీమాంసలోపడి ఆఖరికి మధుతో అన్నది- 'అన్నాయ్! ఏమిటీ రభస? ఎవరైనా వింటే నవ్విపోతారు'. 'అతగాడు అర్థ రాత్రిలో ఎక్కడికో రమ్మంటం, ఎక్కడికని నీవడగటం ఇవన్నీ వింటే ఇతరులు మెచ్చుకుంటారు గాబోలు!' అన్నాడు వెటకారంగా, మధు.

ఇలా అంటూండగానే చంద్రం బజారులోకి నడిచాడు. సరసు కళ్లు బాష్పమయములై పోయాయి. గుండెలు మహావేగంగా కొట్టుకోజొచ్చినాయి. హృదయాంతరాళంలో తెలియని కలవరం బయలుదేరి ఆమెను భయపెడుతోంది. ఒక వంక ఉద్వేగం మరోవంక ఉద్రేకం ఉద్భవించుకొచ్చింది. చంద్రానికీ మధుకూ సంబంధించిన విషయాలు ఆమె మనోవీధిలో కళ్ళకు కట్టినట్లు కన్పించాయి. చివర బంధంలో తురిమిన విరులు విరిసిపోయినాయి. నెరికురులు విడిపోయాయి. మొహం జేవురించింది. పదడుగులు బజార్లోకి నడిచిన చంద్రాన్ని సమీపించి - 'వెళ్ళకండి! అన్నాయ్ మాటల్ని పట్టించుకోకండి, తెల్లారనీయండి నేనూవస్తాను. రండి వెనక్కి రండి!' అంది సరసు దీనంగా ఎదుటికెళ్ళి ప్రాధేయపడుతూ! 'నువ్వా! అసలు ఇన్ని మాటలు మీ అన్నయ్యచేత అనిపించింది నువ్వుకాదూ! అన్ని మాటలు నన్ను అంటూంటే నీవు భార్యవై వుండి అలా వింటావా? నన్ను అవమానించటం, నా జీవితం అపహాస్యం కావటం నీకు ఇష్టం లేకపోతేగా?' అని నెట్టేసి చంద్రం ముందుకు సాగిపోయాడు ఆ అంధకారంలోనే! 'నామాట వినండి.... నేను ఇప్పుడు' అని రెండు మూడుసార్లు అన్న సరసు మాటల్ని చంద్రం వినిపించుకోకుండానే ఆ కాళరాత్రిలో అంతర్హితమైపోయాడు.

భారంగా అడుగులో అడుగేసుకుంటూ సరసు వసారాలోకి వచ్చేప్పటికి మధు లైట్ పుచ్చుకొని నిల్చొని ఉన్నాడు. రాగానే 'అన్నాయ్ ఇంత పొరపాటు చేస్తావని ఎప్పుడూ అనుకోలేదు. నా జీవితంలో మధుర సంగీతం వినిపించినట్లే వినిపించి ఆఖరున మృత్యురాగం ఆలాపిస్తావని వూహించుకోలేక పోయాను. నా జీవితం ఏమవుతుందో నీవు వెనుకాముందూ ఆలోచించ లేదు. జీవం పోసిన నీవే, నీ చేతులారా విషంకూడా పోశావు' అని ఉద్రేకంగా అన్నది. ఈ మాటల్ని వినివిని ఆఖరికి 'అయితే, వెళ్లలేకపోయావా ఈ నిశిరాత్రిలో అతగాడితోనే! మీకూ కొంతభాగం తగ్గేది!' అన్నాడు లోనికెళుతూ! 'అన్నాయ్! నిజంగా నేను ఈ ఇంటికి భారమేనా!' అన్నది సరసు - ఏడుస్తూ. మారు మాట్లాడకుండా తలుపులు మూసుకున్నాడు మధు.

వసారాలో చంద్రం ఖాళీ మంచం కనిపించింది-దూరంగా ఆ ప్రక్కన తన మంచం! వసారాలో...బయటా...అంతటా అంధకారం ప్రకృతి నరకంగా వుంది.

ఎన్నెన్నో ఆలోచనలు పరంపరలుగా ఆమె హృదయ వీధిని చుట్టుముట్టి స్తబ్ధురాల్నిగా చేశాయి. ఒక అగ్ని పర్వతం ప్రకోపించినంత పనయింది.

ఒక్క-పెట్టున ఏడ్చుకుంటూ దొడ్లో పడుకొని వున్న తల్లి దగ్గరకు పరుగెత్తింది. తల్లి తత్తరపడిలేచి 'ఏమిటే' అంది. సరసు ఆమెవొళ్లో తల పెట్టుకొని మరీ బిగ్గరగా విలపించటం మొదలిడింది. సమీపంలో చావడివగ్గర నిద్రిస్తోన్న-సరసు తండ్రి పరుగెత్తుకొచ్చి 'ఏమిటీ' అన్నాడు. సరసు ఏడుస్తూనే-'చంద్రంగారు వెళ్లిపోయారు' అంది. 'ఎందుకూ?' అన్నారు తల్లీతండ్రీ కూడా.

'అన్నాయని అడగండి' అన్నది సరసు! ఇద్దరూ గదిలోకెళ్ళి అడిగేరు మధును. మధు సమాధానం చెప్పలేదు. 'నీకసలు చంద్రం ప్యాసయ్యాడనే ఉక్రోషం కలిగి ఆఖరికి దానికి ఇలాంటిరూపం కల్పించావు. ఒక సామాన్య విషయానికి ఒక పెద్దార్థం కలిపించి సరసు జీవితానికి ఆఘాతం కలుగ జేశావు' అన్నాడు మధు తండ్రి.

తల్లి సరసు తన మంచం మీద పడుకో బెట్టుకుంది. నలువేపులా చీకటి అలుముకునే వుంది. ఇంకా తెల్లారటానికి చాలా వ్యవధివుంది. 'నా జీవితం ఎప్పుడు తెల్లారుతుంది?' అని సరసు లోలోపల అనుకొని ప్రక్కకువొరిగింది. అప్పుడు ఆమెకు తనపొట్టలో ఏదో కదలుతున్నట్లు అనిపించింది. అలా అనిపించగానే సరసు మరల అనుకుంది -'నా జీవితం ఎప్పుడు తెల్లారుతుందో!' అని.

# చీకటి ఖండంలో భారతీయులు

తుర్లపాటి వెంకట కుటుంబరావు

హిట్లర్ మరణించాడని కొందరి విశ్వాసం; మరణించలేదని మరికొందరి అభిప్రాయం. ఆయన విగతజీవుడైనా, లేక సజీవుడై వున్నా, ఆయన ప్రతిపాదించిన జాతివిద్వేష సిద్ధాంతం మాత్రం ఇంకా సజీవంగానే వున్నది. ఇందుకు తార్కాణం,-దక్షిణాఫ్రికాలో డాక్టర్ మలాన్ ప్రభుత్వం భారతీయులపట్ల అనుసరిస్తున్న జాత్యహంకారపూరిత నికృష్టవిధానమే.

ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామంలో నేమి, అతఃపూర్వమేమి హిట్లరు స్థాపించిన నేషనల్ సోషలిస్టు పార్టీ - జర్మన్ యూదులను దారుణంగా హింసించిందని యూరప్, అమెరికాలలో విశేషంగా ఆందోళన జరిగింది. కాని, నేడు దక్షిణాఫ్రికా భారతీయులపట్ల డాక్టర్ మలాన్ ప్రభుత్వం అంతకంటె అమానుషమైన-అక్రమమైన—విధానాలను అవలంబిస్తున్నది.

నేటి దక్షిణాఫ్రికా పరిపాలకులు ప్రజాస్వామికవాదులుకారు; హిట్లర్ శిష్యులే. అంతే కాదు, - వారు నరరూప రాక్షసులు కూడా. వారిలో మానవత్వం నశించింది; దానవత్వం ప్రకోపించింది. మానవుడు తనతోటి మానవుని పట్ల ఎంతవరకు దానవుడుగా వ్యవహరించ గలడో నేటి దక్షిణాఫ్రికా ప్రధాని డాక్టర్ మలాన్ నిరూపిస్తున్నాడు.

ఇది అసభ్యవిమర్శ అని కొందరు విమర్శించవచ్చు; అనాగరిక పదజాల ప్రయోగమని మరికొందరు ఖండించవచ్చు. అయితే సభ్యతకు-నాగరికతకు- పేరెన్నికగన్న పారిస్ నుండి వెలువడే ఫ్రెంచి సోషలిస్టు దినపత్రిక "లె పాప్యులేర్" ఇంతకంటె తీవ్రమైన పదజాలంతో డాక్టర్ మలాన్ను, ఆయన ప్రభుత్వం శ్వేతేతర జాతులపట్ల అవలంబిస్తున్న నికృష్ట విద్వేషాన్ని ఖండించింది.

డాక్టర్ మలాన్, ఆయన సహచరులను మించిన నరమాంస భక్షకులు దక్షిణాఫ్రికా ముండ్ల పొదలలో లేరని, వారు హిట్లర్ శిష్యులని